క్లుప్తంగా

రైతు ర్యాలీ విజయవంతం చేయాలి



పానెం చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: రాష్ట్రంలో గిట్టుబాటు ధరలకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం బాపట్లలో నిర్వహించే రైతు ర్యాలీని విజయవంతం చేయాలని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ర్యాలీ అనంతరం జిల్లా కలెక్టర్‌కు విజ్ఞాపన పత్రం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎస్ఐఆర్‌డీ జేడీ కేశవరెడ్డి

యద్దనపూడి: పంచాయతీలు బాగుంటేనే దేశం బాగుంటుందని ఏపీఎస్ఐఆర్‌డీ జేడీ కే కేశవరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రం యద్దనపూడి ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో స్థానిక వనరులను ఉపయోగించుకొని ఆదాయం పెంచుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ మేనేజర్ అమర్ బాబు, ఈటీసీ బాపట్ల లింక్ ఆఫీసర్ వర్ధిని, ఎంపీడీవో అఖీబ్ జావెద్, ఈవోపీఆర్డీ కృష్ణ, వైద్యాధికారి, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు

వేటపాలెం: చల్లారెడ్డిపాలెం పంచాయతీ కొత్తపాలెం రోడ్డులోగల దత్త క్షేత్రంలో దత్త జయంతి మహోత్సవాల్లో ఆరో రోజు భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. భక్తులు రాసిన రామకోటి, శ్రీరామ మంత్రాలను క్షేత్రంలో ఏర్పాటు చేస్తున్న రామస్తూపంలో నిక్షిప్తం చేశారు. అనంతరం దత్తయజ్ఞం, పంచదత్తుల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సిద్ధమంగళ స్తోత్రం 1008 సార్లు భక్తిశ్రద్ధలతో పారాయణ చేశారు. ఆదివారం దత్త జయంతిని అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఆలయం ప్రాంగణంలో గాయత్రి స్తూపం, లక్ష్మి స్తూపం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఖాళీ స్థలాలు.. రోగాలకు నిలయాలు



గ్రామ సచివాలయానికి వెళ్లే రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో పెరిగిన చెట్లు



రైతు సేవా కేంద్రం, హెల్త్ సెంటర్ మధ్యలో ఖాళీ స్థలంలో పెరిగిన మొక్కలు

- చిట్టడవిని తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- విషపురుగులు, సర్పాలకు ఆవాసాలుగా మారిన వైనం
- విజృంభిస్తున్న దోమలు
- రాత్రిపూట వెళ్లాలంటే భయపడుతున్న మహిళలు

వేటపాలెం: అధికారులు సరిగా పనిచేస్తే చాలా సమస్యలు పరిష్కారం అవుతాయి. గ్రామాల్లో ఖాళీగా వదిలేసిన స్థలాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. తరచూ వర్షాలు కురవడంతో ఏపుగా పెరిగిన మొక్కలు. కొందరు వారికి సంబంధించిన స్థలాల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో చెట్లు పెరిగిపోతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. అయితే స్థల నిర్వహణ విషయాన్ని పట్టించుకోవాల్సిన యజమానులు మాత్రం స్పందించడం లేదు. దీంతో పరిసర ప్రాంత ప్రజల ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు ప్రమాదకరంగా మారాయి. తక్కువ రేట్లు ఉన్నప్పుడు కొందరు వ్యక్తులు ఖాళీ స్థలాలను కొని ధరలు పెరిగినప్పుడు అమ్ముకుందామని వదిలేసిన స్థలాలు ఏళ్ల తరబడి అలాగే ఉండిపోయాయి. దీంతో ఆయా ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి చిట్టడవులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా వర్షపు నీరు ఆ స్థలంలో నిలిచి మురుగు పెరిగిపోయింది. దీంతో స్థలం ఖాళీగా ఉండటంతో చుట్టు పక్కల నివసించే వారు పడేసే చెత్తా, చెదారం, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. ముఖ్యంగా ఖాళీ స్థలాలు అధ్వానంగా ఉన్నప్పటికీ అసాంఘిక శక్తులు అక్కడికి చేరాయి. దీంతో స్థానికంగా నివసిస్తున్న వారికి నిద్ర లేకుండా భయభ్రాంతులకు గురి చేయడం పరిపాటిగా మారింది.

విషసర్పాలకు నిలయాలుగా..

ఏపుగా పెరిగిన చెట్లు, ముళ్లపొదల్లో విషసర్పాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా దోమలు విజృంభించి నివాసితులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాటి దాటికి తట్టుకోలేక పోతున్నామని, లేనిపోని రోగాలను కొని తెచ్చుకునే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖాళీ స్థలాల్లో ఆవాసాలుగా ఏర్పచుకున్న విషసర్పాలు చుట్టు పక్కన ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

బాధ్యత ఎవరిది ?

ఖాళీ స్థలాల యజమానులకు అధికారులు నోటీసులు ఇవ్వడంతో పాటు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగించి మురుగు నీరు నిల్వ లేకుండా చేయాలని నోటీసులు ఇవ్వాలి. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు విజృంభించి చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు రోగాల బారిన పడుతున్నారు. ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి వారి స్థలాలను శుభ్రం చేయించడం, వాటిలో మెరక చేసుకోవాలని నోటీసులు ఇవ్వాల్సిన సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి పరిస్థితి ఎదురవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రయాణికుల అవసరాల మేరకు సర్వీసులు



ప్రయాణికుల వినతులను వింటున్న డిపో మేనేజర్

చీరాల అర్బన్: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీ ఎప్పుడూ ముందుంటుందని.. ప్రయాణికుల అవసరాలను మేరకు సర్వీసులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జె.శ్యామల తెలిపారు. గురువారం స్థానిక డిపో మేనేజర్ కార్యాలయంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చీరాల ఆర్టీసీ డిపో పరిధిలోని చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లోని పలువురు ప్రయాణికులు సూచనలు, వినతులు అందించారు. వాటిలో చీరాల నుంచి తిరుపతికి బస్సు సౌకర్యం కల్పించాలని, చీరాల నుంచి విజయవాడకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు పెంచాలని కోరారు. గుంటూరు నుంచి చీరాలకు సాయంత్రం 5 గంటల తర్వాత సర్వీసులు పెంచాలని, చీరాల నుంచి బీహెచ్ఈఎల్ వెళ్లే బస్సులు ఎంజీడీఎస్ బస్టాండ్ లోపలికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పావులూరు నుంచి ఇంకొల్లు, చీరాలకు బస్సు సౌకర్యం కల్పించాలని, చీరాల నుంచి పూనూరుకు బస్సు సౌకర్యం, చీరాల నుంచి మచిలీపట్నానికి బస్సు సౌకర్యం కల్పించాలని పలువురు ప్రయాణికులు డిపో మేనేజర్‌కు విన్నవించారు. వచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకుని ఉన్నతాధికారులను సంప్రదించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాన్ని కల్పిస్తామని డిపో మేనేజర్ శ్యామల తెలిపారు.

జర్నలిస్టులపై మోహన్‌బాబు దాడి హేయం



పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

పర్చూరు (చినగంజాం): జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు తీవ్రంగా ఖండించారు. దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో టీవీ రిపోర్టర్‌పై మంచు మోహన్‌బాబు చేసిన దాడికి నిరసనగా పర్చూరులో నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వీడియో కవరేజ్ చేయటానికి వెళ్లిన టీవీ 9 రిపోర్టర్‌పై మోహన్‌బాబు మైకుతో దాడి చేశారని దానిని ఖండిస్తున్నామంటూ నినాదాలు చేశారు. అనంతరం ఒక ఫిర్యాదుని స్థానిక ఎస్సై మాల్యాద్రికి, తహసీల్దార్ పీ బ్రహ్మయ్యలకు అందజేశారు. కార్యక్రమంలో విలేకరులు కే రామకృష్ణంరాజు, కే సుబ్బారావు, షేక్ అయూబ్, కే రవి, షేక్ రెహమాన్, దళిత నాయకులు ఎన్ కిషోర్, సీపీఎం నాయకులు ఎం డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో ఉపయోగాలు



మక్కెనవారిపాలెంలో ప్రత్యేకాధికారికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు



తోటవారిపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్ గోపీకృష్ణ



రాజుబంగారుపాలెంలో అర్జీలందుకుంటున్న తహసీల్దార్

జే.పంగులూరు: రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకొని గ్రామాల్లో ఉండే భూ సమస్యలను పరిష్కారించుకోవాలని పంగులూరు మండల తహశీల్దార్ పీ సింగారావు కోరారు. మండలంలోని రామకూరు, కల్లవారిపాలెం గ్రామాల్లో గురువారం రెవిన్యూ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సింగారావు మాట్లాడుతూ గ్రామాల్లో అనేక సంవత్సరాలుగా భూ సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు చక్కని వేదికలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ మైనింగ్ ఏడీ రాజేష్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు కారణంగా అనేక గొడవలు జరుగుతున్నాయన్నారు. రక్త సంబంధీకుల్లో కూడా ఈగొడవలు ఉన్నాయన్నారు. వాటికి చెక్ పెట్టేదుకు కార్యక్రమం అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ బాపయ్య, సర్వేయర్ సురేష్ బాబు, వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది మొత్తం పాల్గొన్నారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): తమ పొలాల్లో కొలతలు అవకతవకలుగా ఉన్నాయని మళ్లీ రీ సర్వే చేయించాలని సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం రైతులు గ్రామంలో రెవెన్యూ సదస్సులో అధికారులను కోరారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు తమ అర్జీలను అధికారులకు అందజేశారు. పొలాలను సర్వే చేసే సమయంలో రైతులకు ఉన్న పొలం కన్నా తక్కువగా ఆన్‌లైన్‌లో కావటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ రీసర్వే చేయించి తమ పొలాలను తమకు ఇప్పించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

చీరాల టౌన్: భూ సమస్యలన్నింటిని పరిష్కరించేందుకే మీభూమి-మీహక్కు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. మండలంలోని తోటవారిపాలెం గ్రామ పంచాయతీ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించి అర్జీలు స్వీకరించారు. 21 భూ సమస్యలకు సంబంధించి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ దేవతోటి అర్జున్, సర్వేయర్ చెరుకూరి బ్రాహ్మణయ్య, వీఆర్వో శివారెడ్డి, రెవెన్యూ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో ఉపయోగం..

చినగంజాం: రెవెన్యూ గ్రామాల్లో గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండలంలోని రాజు బంగారుపాలెం పంచాయతీ కార్యాలయం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభలో మొత్తం 18 అర్జీలందగా కుల ధ్రువీకరణ కోసం 12, భూ సర్వే కోసం 4, 1-బీ అడంగల్ కోసం 2 అందినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ సుబ్బారావు, వీఆర్వో పద్మ, పంచాయతీ కార్యదర్శి తులసి, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల ఆకస్మిక తనిఖీలు



కేసులు నమోదు చేసిన వినియోగదారులతో విద్యుత్ అధికారులు

మార్టూరు: విద్యుత్శాఖ అధికారులు మార్టూరు మండలంలో గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అద్దంకి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ మస్తాన్‌రావు ఆధ్వర్యంలో 30 బృందాలుగా ఏర్పడి అన్ని గ్రామాలను జల్లెడ పట్టారు. తనిఖీల్లో భాగంగా 63 మందిపై కేసులు నమోదు చేసి రూ.3.18 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు మార్టూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం సురేంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో అద్దంకి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం దామోదర్ రాజు అద్దంకి డివిజన్లోని అన్ని మండలాల ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన బాధ్యత పంచాయతీలదే



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమ కుమారి

బల్లికురవ: గ్రామాల్లో పేదరిక నిర్మూలన.. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీలదేనని ఎంపీడీవో కుసుమ కుమారి అన్నారు. ఎల్ఎస్‌డీజీఎస్‌పై గురువారం పంచాయతీల్లోని సర్పంచ్‌లు ఎంపీటీసీలు, సెక్రటరీలు, సచివాలయ సిబ్బందికి రెండు బ్యాచ్‌లుగా స్థానిక పరిషత్ కార్యాలయంలో శిక్షణ నిర్వహించారు. శిక్షణలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఆదాయ వనరులు పెంచుకోవాలన్నారు. ఇంటి పన్ను వసూళ్లపై దృష్టిపెట్టాలన్నారు. ప్రజాప్రతినిధులు మండలస్థాయి అధికారులు సచివాలయ సెక్రటరీలు సిబ్బంది, సమన్వయంతో పని చేస్తూ గ్రామాలను అభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నారు. ఈశిక్షణ సమావేశంలో ఈవోఆర్డీ దాసరి సుమతి, వైద్యాధికారి రవితేజ, ఐసీడీఎస్ సీడీపీవో సుధ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నెలవుగా వంతెనలు



చీరాల రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న రహదారి

- ప్రమాదకరంగా కొమ్మమూరు కాలువపై వంతెన
- ప్రమాదాలు జరుగుతున్నా చోద్యం చూస్తున్న అధికారులు

స్వర్ణ (కారంచేడు): గ్రామీణ ప్రాంతాలకు చెందిన రహదారులను కూడా సర్వాంగ సుందరంగా, వాహనదారులను సౌకర్యవంతంగా రహదారులను నిర్మిస్తున్నాం అని కూటమి నాయకులు ప్రగల్భాలు పలికాలరే తప్పా ఎలాంటి పనులు చేయలేదు. నాయకులు, అధికారులు గొప్పలు చెప్పుకోవడమే కాని క్షేత్రస్థాయిలో ప్రయాణికులు, ప్రజలు పడే ఇబ్బందులు అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దశాబ్దాల క్రితం ఎప్పుడో బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెనలు ఇప్పటికీ ప్రయాణికుల ప్రమాదాలకు సజీవ సాక్ష్యాలుగా ఉంటున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. కొమ్మమూరు కాలువపై మండలంలోని స్వర్ణ గ్రామం వద్ద నిర్మించిన వంతెన ఇందుకు ఉదాహరణ. పదుల సంవత్సరాలు దాటినా వంతెన పునాదుల్లో చెక్కు చెదరకపోయినా వంతెనకు ఇరువైపులా ఉండే రహదారులు మాత్రం ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. చీరాల నుంచి స్వర్ణ, స్వర్ణపాలెం, కేశవరప్పాడు, కొడవలివారిపాలెం, జరుబులవారిపాలెం, నాయుడువారిపాలెం, దగ్గుబాడు, పోతినివారిపాలెం, రంగప్పనాయుడువారిపాలెం, తిమిడెదపాడు, ఇంకొల్లు మండలంలోని హనుమోజీపాలెం, ఇంకొల్లు గ్రామాలకు ప్రయాణించే వాహనాలు, ఆటోలు, ద్విచక్రవాహనాలు ఈ మార్గం గుండానే వెళ్తుంటాయి. ఈ రహదారిలో ఉండే మలుపులే ప్రమాదాలకు సంకేతంగా ఉన్నాయి.

పట్టించుకోని అధికారులు..

ప్రతి రోజు ఈ రహదారిలో ఎక్కడో ఒక చోట ప్రమాదం జరిగి ప్రయాణికులు ప్రమాదాలకు గురవతున్నారు. కొన్ని సార్లు ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకున్న కూడా. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. కొమ్మమూరు కాలువపై నిర్మించిన వంతెనకు ఇరువైపులా ఉండే రోడ్డు మార్జిన్‌లు సరిగ్గా లేకపోడవం, రోడ్డు సమాంతరానికి సుమారు 20 నుంచి 30 అడుగుల ఎత్తుగా ఉండటం, వంతెన ఎక్కే క్రమంలో వాహనాలు వేగంగా రావడం, ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో పల్టీలు కొట్టడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేలా ఇరువైపులా రోడ్డు మార్జిన్‌లతో కూడిన రహదారులను నిర్మాణం చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

> **ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు..**
> చీరాల-స్వర్ణ రోడ్డులో స్వర్ణ సమీపంలో ఉన్న కొమ్మమూరు కాలువపై నిర్మించిన వంతెన ఎత్తుగా ఉండటం వలన, రోడ్డుకు మార్జిన్‌లు లేకపోవడం వలన ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ రహదారిలో జరిగిన ప్రమాదాల్లో అనేక మందికి గాయాలైతే, కొంత మంది చనిపోయారు కూడా.
> – కే రాజు, స్వర్ణ

> **అధికారులు స్పందించాలి..**
> రహదారుల ప్రమాదాల్లో ఉన్న లోపాలు అనేకసార్లు పత్రికల్లో వచ్చినా అధికారులు స్పందించడం లేదు. రోడ్డుకు వంతెన ఎత్తుగా ఉండటం వలన వాహనాలు వేగంగా రావాల్సి వస్తుంది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల్లో కూడా ఎలాంటి హెచ్చరికలు లేకపోవడం ప్రమాదాలకు కారణాలుగా ఉన్నాయి.
> – ఎస్‌వీ రామారావు, కేశవరప్పాడు



ఇంకొల్లు వైపునకు వేగంగా వస్తున్న వాహనాలు

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

చీరాల రూరల్: న్యాయవాద వృత్తిని నిర్వీర్యంచేసే దిశగా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ గురువారం చీరాల న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడారు. గంజాయి కేసులకు సంబంధించి గతంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో కోర్టులు ఉండేవన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రాష్ట్రంలో కేవలం నాలుగు చోట్ల మాత్రమే కోర్టులు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నదని దాని వలన న్యాయవాదులు తీవ్ర ఇబ్బందులు పడతారని చెప్పారు. యథాస్థితిగా కోర్టులు ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అలానే న్యాయవాదులకు సంబంధించి బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కొత్తగా సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ పేరిట ఐదు వకాలత్‌లు లేదా ఐదు మెమో ఆఫ్ అప్పీరెన్స్‌లు వేసి ఎడ్యుకేషనల్ క్వాలిఫికేషన్‌కు సంబంధించి నకలు సర్టిఫికెట్లు దాఖలు చేయమనడం తగదన్నారు. రూ.500 బ్యాంకులో చలానా తీయడం వంటి అంశాలు న్యాయవాదులను, న్యాయవాద వృత్తిని అగౌరపరచడమేనని పేర్కొన్నారు. తక్షణమే ఈ విధానాన్ని బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. రమేష్ బాబు, ఉపాధ్యక్షుడు బోయిన వాసుబాబు, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మొబైల్ బుక్ కీపింగ్ తప్పనిసరి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకోవడంతో పాటుగా మొబైల్ బుక్ కీపింగ్‌ను నిర్వహించాలని ఏపీఎం మధుసూదనరావు సూచించారు. గురువారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధిని పెంచేలా పొదుపు సంఘాల వీవోలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రూపు విధిగా ప్రతినెల 10తేదీ సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు. స్త్రీనిధి రికవరీలు పూర్తిగా వసూళ్లు చేయాలన్నారు. ప్రతి గ్రూపు తీసుకున్న రుణాలను కేవలం స్వయం సహకారం పెంపొందించుకునే సంస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పొదుపు గ్రూపులు రుణాల చెల్లింపులో అలసత్వం వహించ కూడదన్నారు. ఈ సమావేశంలో మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన వీధిలైట్లు

జే.పంగులూరు: మండల పరిధిలోని ఆరికట్లవారిపాలెంలో షార్ట్ సర్క్యూట్‌తో వీధిలైట్లు కాలిపోయాయి. వివరాల్లోకి వెళితే బుధవారం రాత్రి ఇంకొల్లు వైపు నుంచి వచ్చే 11 కేవీ వైరు తెగి గ్రామంలోని విద్యుత్ వైర్లపై పడింది. దీనితో షార్ట్ సర్క్యూట్ అయ్యి గ్రామంలోని 73 వరకు వీధి లైట్లు కాలిపోయి. గ్రామం మొత్తం 150 వరకు వీధి లైట్లు ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని దళిత కాలనీలో వీధిలైట్లు కాలిపోయినట్లు కాలనీవాసులు తెలిపారు. రాత్రంతా చీకటిలో గడిపినట్లు గ్రామస్తులు తెలిపారు. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి కాలనీలో వీధిలైట్లు వేయాలని కోరారు.

సాగునీటి సంఘాలకు నోటిఫికేషన్

బల్లికురవ: మండలంలో ఏడు సాగునీటి సంఘాలు, ఐదు మైనర్ ఇరిగేషన్ చెరువులకు శనివారం ఉదయం నామినేషన్‌లతో ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు తహసీల్దార్ ఎం నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్లికురవ, వైదన, గొర్రెపాడు 1 నుంచి ఉప్పుమాగులూరు, కొణిదెన, చెన్నుపల్లి సాగునీటి సంఘాల ఒక్కో సంఘానికి 12 మంది సభ్యుల ఎంపికతో వీరి నుంచే అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని చెప్పారు. రైతులు, రాజకీయ పార్టీలు సహకరించాలని తహసీల్దార్ ప్రకటనలో కోరారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, మార్గశిర మాసం, భరణి నక్షత్రం, ద్వాదశి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

డ్రాపవుట్స్ లేకుండా చూడాలి

సంతమాగులూరు (అద్దంకి): మండలంలోని ఏల్చూరు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ బాలికల ఉన్నత పాఠశాలను ఏపీ రాష్ట్ర మహిళా హక్కుల సంఘం సభ్యురాలు పద్మావతి గురువారం ఆకస్మికంగా తనీకి చేశారు. పాఠశాల రికార్డులు, డ్రాప్ అవుట్ విద్యార్థుల వివరాలు, తెలుసుకున్నారు. డ్రాప్ అవుట్‌లు పెరగకుండా చూడాలని ఉపాధ్యాయులకు ఆమె చెప్పారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఏ శ్రీనివాసరావు, ఎంఈవో కోటేశ్వరరావు, డీ దినేష్‌కుమార్, సంతమాగులూరు వైద్యాధికారి జే నిర్మల్‌కుమార్, నూతపాటి వీరాంజేయులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లకు జరిమానా



ట్రాక్టర్ల జరిమానా విధిస్తున్న తహసీల్దార్ పార్వతి

వేటపాలెం: అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పార్వతి పేర్కొన్నారు. గురువారం ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని జరిమానా విధించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తుండగా బైపాస్ రోడ్డులో పట్టుకున్నామని తహసీల్దార్ తెలిపారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3 వేల చొప్పున మొత్తం మూడు ట్రాక్టర్లకు రూ.9 వేలు జరిమానా విధించినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.